

మానేరు నది తీరంలో నిమజ్జనం



సిరిసిల్ల టౌన్: సిరిసిల్లలో తొమ్మిది రోజుల పాటు బతుకమ్మలు పేర్చి సాయంత్రం వేళలో గంటల తరబడిగా ఉయ్యాల పాటలతో బతుకమ్మలు ఆడతాం. రాత్రి వేళలో మానేరు నది తీరానికి వెళ్లి నిమజ్జనం చేయడం ఆనవాయితీ. గౌరమ్మను నిమజ్జనం చేసి వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. పసుపు, కుంకుమలు పెట్టుకుంటూ సౌభాగ్యంగా భావిస్తారు.
– ఎల్లంకి వాణి, సిరిసిల్ల

కాలనీలో రోజూ ఆడతాం



సిరిసిల్ల టౌన్: గౌరమ్మను రోజు పేర్చి తొమ్మిది రోజులు మూకుమ్మడిగా బతుకమ్మ సంబరాలు జరుపుకుంటాం. చప్పట్లను కూడా లయబద్ధంగా కొడుతూ..బతుకమ్మ ఆడటం తెలంగాణ మహిళల ప్రత్యేకత. కాలనీలో రోజూ మహిళలంతా కలిసి బతుకమ్మ సంబరాలు జరుపుతాం.
– కట్ట వింధ్యారాణి, సిరిసిల్ల

ఆడబిడ్డలకు పెద్ద పండుగ



చందుర్తి : సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఆడపడుచులకు అతి పెద్ద పండుగ. బతుకమ్మ పండుగ వస్తే గ్రామంలో కలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితులంతా ఒకచోట కూడి బతుకమ్మ ఆడుకునే అవకాశం వస్తుంది. అందరం కలిస్తే ఆ సంబరమే వేరు.
– బైరగోని లావణ్య, నర్సింగాపూర్, మాజీ ఎంపీపీ

క్లుప్తంగా

ఎస్సీడీవోకు వినతిపత్రం అందజేత

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీసర్కిల్ డైరెక్టర్‌గా ఎస్సీ సామాజికవర్గం వారినే నియమించాలని ప్రజాసంఘాల నేతలు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్సీడీవో ఆఫీసులో వినతిపత్రం అందించి మాట్లాడారు. దళితులు, విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వం ఎస్సీస్టడీ సర్కిల్ ఏర్పాటు చేసిందన్నారు. ఎస్సీ సడీ సర్కిల్‌లో ఇతర వర్గాల వారికి డైరెక్టర్, ఇతర పోస్టులు ఇవ్వకుండా ఎస్సీవర్గాల వారికే ఇస్తే న్యాయం జరుగుతుందన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు, నాయకులు దొబ్బల ప్రవీణ్‌కుమార్, మల్లారం ప్రశాంత్, మాసం సుమన్, మధు, అజయ్, విక్రం, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన వైద్య విద్యార్థులకు ప్రశంసలు

సిరిసిల్లకల్చరల్: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎంబీబీఎస్ ఫస్టియర్ ఫైనల్ ఎగ్జామ్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బైరి లక్ష్మీనారాయణ అభినందించారు. 2024లో జరిగిన పరీక్షల్లో 75 శాతానికిపైగా మార్కులు సాధించిన అర్జున్ గెహ్లాత్, కౌశికి కేసరవాణి, కశిశ్‌వర్మలను అభినందించారు. బయోకెమిస్ట్రీలో 9 మంది విద్యార్థులు, అనాటమీలో ముగ్గురు, ఫిజియాలజీలో ముగ్గురు మొత్తం 15 మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించారని తెలిపారు. ప్రథమ శ్రేణిలో 39 మంది, బయోకెమిస్ట్రీలో 100శాతం, అనాటమీలో 97శాతం, ఫిజియాలజీలో 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

మంత్రి ఉత్తమ్‌కు పరామర్శ



వేములవాడ: రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఇటీవల మృతిచెందాడు. గురువారం మంత్రి ఉత్తమ్ నివాసంలో ఆయనను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

వేములవాడఅర్బన్: వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఈనెల 9న చందుర్తి మండలకేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్నట్లు సెస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వేములవాడ టౌన్, వేములవాడ రూరల్, చందుర్తి, కోనరావుపేట, బోయినపల్లి, రుద్రంగి మండలాలకు చెందిన సిరిసిల్ల విద్యుత్ సహకార సంస్థ వినియోగదారులు హాజరుకావాలన్నారు.

ఏఎంసీ చైర్మన్లకు సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్, గంభీరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్లుగా నియామకమైన షేక్ సబేరా బేగం, కొమిరిశెట్టి విజయను బండలింగంపల్లి కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో ఇద్దరిని శాలువాలతో సత్కరించారు. రైతులకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జంగ అంజిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మోత్కు బాల్‌యాదవ్, రేపాక రాజమల్లు, అప్పనపల్లి రమేశ్ తదితరులున్నారు.

ఎంపీడీవో, కార్యదర్శులకు అధికారుల ఆదేశాలు

సాక్షి స్పందన

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లిలో ఉన్న రైస్ మిల్లులు, ఫాజుల్‌నగర్‌లోని బస్‌షెల్టర్‌పై సాక్షిలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనికి స్పందించిన జిల్లా అధికారులు ఎంపీడీఓ, కార్యదర్శులకు వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు సదరు అధికారులు నివేదిక అందజేశారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

వీర్నపల్లి: మండలకేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్‌ను వీర్నపల్లి క్రికెట్ అసోసియేషన్ నిర్వాహకులతో కలిసి కాంగ్రెస్ నాయకులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి యాదవ్, మాజీ సర్పంచ్ పాటి దినకర్, సీనియర్ నాయకులు రాజు నాయక్, డైరెక్టర్లు చంద్రమౌళి, సంతోష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని వెంకట్రావుపేటలో కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎంపీటీసీలు దేవరకొండ నర్సింహాచారి, పల్లె మంజుల రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ముస్తాబాద్: పోతుగల్‌లో దుర్గామాతను మండపానికి తీసుకొస్తున్న నిర్వాహకులు



ఇల్లంతకుంట: మండపంలో పూజలు చేస్తున్న హిందూ వాహిని సేవాసమితి సభ్యులు



కోనరావుపేట: కొలనూర్‌లో అమ్మవారిని మండపానికి తరలిస్తున్న గ్రామస్తులు

దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం


వేములవాడ/ముస్తాబాద్/ ఇల్లంతకుంట/ కోనరావుపేట/ ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/ వీర్నపల్లి : దేవీ శరన్నరాత్రోత్సవాలు గురువారం జిల్లాలో ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గామాతను డప్పుచప్పుళ్లు, మహిళల కోలాటం మధ్య వాహనాల్లో మండపాలకు తరలించి ప్రతిష్ఠించారు. తొలిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారు రోజుకో అలంకరణలో దర్శనమివ్వనున్నారు.



వేములవాడలో మహిళల నృత్యాలు..



ఎల్లారెడ్డిపేటలో..



బోయినపల్లి: కొలువుదీరిన దుర్గామాత



వీర్నపల్లిలో మండపానికి తీసుకొస్తున్న నిర్వాహకులు



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్– వెంకటాపూర్ గ్రామాల మధ్య సిరిసిల్ల– కామారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు వద్ద రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ఈ రహదారిపై రోడ్డుకోతకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: కిరణ్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, ఎల్లారెడ్డిపేట: 9440818864

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

కొండా సురేఖ వ్యాఖ్యలు సరికాదు



బీఆర్‌ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ

సిరిసిల్లటౌన్: మంత్రి కొండా సురేఖ సినీనటి సమంత, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ఖండించారు. మంత్రి వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిరసన తెలిపారు. వందలాది సంఖ్యలో మహిళలు ప్రధాన రోడ్లపై నిరసన ర్యాలీ చేపట్టారు. గాంధీచౌక్‌లో కొండా సురేఖ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సరికాదని, సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. గాంధీచౌక్‌లో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి, మంత్రి కొండా సురేఖకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షురాలు బత్తుల వనజ, చేరాల స్వాతి, దిడ్డి మాధవి, గడ్డం లత తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే..

రాష్ట్ర మహిళా మంత్రి కొండా సురేఖ రాజకీయ లబ్ధికోసం సినీనటి సమంతపై చేసిన వ్యాఖ్యలు మీకు తగునా అంటూ ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ విభాగం రాష్ట్ర కన్వీనర్ మక్కపల్లి పూజ అన్నారు. సిరిసిల్లలో ఏర్పాటు చేసి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇక్కడ నాయకురాళ్లు వాసవి, మనీషా, ప్రగతి, అశ్విని తదితరులున్నారు.

మత్స్యకారులు లక్షాధికారులు కావాలి



మాట్లాడుతున్న పిట్టల రవీందర్

తంగళ్లపల్లి: మత్స్యకారులు లక్షాధికారులుగా ఎదగాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ కోరారు. తంగళ్లపల్లిలోని ఫ్రెండ్స్‌క్లబ్‌లో గురువారం ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో మత్స్య సహకార సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం రూ.20వేల కోట్లతో దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ప్రకృతి పర్యావరణ సంస్థ అధ్యక్షుడు పి.మాధవరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు రామచందర్, వైస్‌చైర్మన్ శేఖర్, డైరెక్టర పరుశరాములు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● స్వీపర్స్, స్కావెంజర్స్ జీతాలు చెల్లించాలి

సిరిసిల్లఅర్బన్: స్వీపర్స్, స్కావెంజర్స్ జీతాలు చెల్లించాలని ప్రభుత్వ పాఠశాల స్వీపర్స్, స్కావెంజర్స్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. పండుగకు నిత్యావసర వస్తువులు కొనలేని పరిస్థితి ఉందన్నారు. అమ్మ ఆదర్శ కమిటీలను రద్దు చేసి నేరుగా కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలని కోరారు. మీసం లక్ష్మణ్, దండి లక్ష్మి, లింగంపల్లి మల్లవ్వ, బొద్దు నర్సవ్వ, రేణుక, శ్యామల, తేజశ్రీ, వనజ, శంకర్ పాల్గొన్నారు.

● అసెంబ్లీ బతుకమ్మ వేడుకల్లో విప్

వేములవాడ: రాష్ట్ర అసెంబ్లీ ఆవరణ లాబీల్లోని మెంబర్స్‌లాంజ్‌లో కౌన్సిల్ మహిళా ఉద్యోగులు, సిబ్బంది నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌లతో కలసి పాల్గొన్నారు.

● డిగ్రీ కళాశాలలు నిరవధిక బంద్

వేములవాడఅర్బన్: ప్రభుత్వ తీరును నిరసిస్తూ శాతవాహన యూనివర్సిటీ పరిధి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు దసరా తర్వాత నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చినట్లు జిల్లా ఉపాధ్యక్షుడు ఆయచితుల జితేందర్‌రావు గురువారం తెలిపారు. రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు యూనివర్సిటీ పరిధిలోని అన్ని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను మూసివేయనున్నట్లు పేర్కొన్నారు.

● బీజేపీ సభ్యత్వ నమోదు

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండల బీజేపీ సభ్యత్వను నాంపల్లి లక్ష్మీ నర్సింహ గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్ హాజరయ్యారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి కార్డులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేశ్, బుర్ర శేఖర్, జింక అనిల్, రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

● నూతన భవనంలోకి దేశాయి బీడీ కంపెనీ

గంభీరావుపేట: గంభీరావుపేటలోని దేశాయి బ్రదర్స్ బీడీకంపెనీ గురువారం నూతన భవనంలోకి మారింది. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం, బీసీసంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మండ్లు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, మండలశాఖ అధ్యక్షుడు హమీద్, మాజీసర్పంచ్ బాలయ్య పాల్గొన్నారు.

● నియామకం

వేములవాడ అర్బన్: వేములవాడలోని సాయినగర్‌కు చెందిన దండు వినోద్‌ను బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టినందుకు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

● పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఇల్లంతకుంట : మండలంలోని పలుగ్రామాల్లో పనిచేస్తున్న సఫాయి కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని మండల పంచాయతీ కార్మికుల అధ్యక్షుడు వర్కోలు మల్లయ్య ఎంపీడీవోకు గురువారం వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని దసరా పండుగకైనా జీతాలు చెల్లించాలని ఆయన కోరారు.

● నిధులు మంజూరు

ముస్తాబాద్: నామాపూర్‌లో ఇరిగేషన్ సెక్షన్ ఆఫీస్ భవన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు డీఈఈ రవికుమార్ తెలిపారు. సెక్షన్ కార్యాలయం నిర్మాణానికి రూ.31లక్షలు మంజూరుకాగా త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడుతామన్నారు.

● కురుమ సంఘం అధ్యక్షుడిగా కరుణాకర్

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి శ్రీ మల్లికార్జున కురుమ సంఘం అధ్యక్షుడిగా ఎగుర్ల కరుణాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఒగ్గు కుంటయ్య, ప్రధాన కార్యదర్శిగా అంజయ్య, కోశాధికారిగా దయ్యాల రాములు, కార్యదర్శిగా మల్లేశం, ముఖ్య సలహాదారుగా రాములు ఏకగ్రీవమయ్యారు. సంఘం అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు.

క్రీడలతో ఉల్లాసం



బెటాలియన్ స్పోర్ట్స్ మినిట్స్ ప్రారంభిస్తున్న కమాండెంట్ శ్రీనివాసరావు

సిరిసిల్లక్రైం: ఉద్యోగ నిర్వహణలో పని ఒత్తిడిలో ఉన్న వారికి క్రీడలు ఉల్లాసాన్ని ఇస్తాయని 17వ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సర్దాపూర్‌లోని బెటాలియన్ ఉద్యోగులకు గురువారం స్పోర్ట్స్‌మీట్ నిర్వహించారు. క్రికెట్, జావలిన్ త్రో, షాట్‌పుట్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, లాంగ్‌జంప్, హైజంప్, 5 కిలోమీటర్ల రన్నింగ్, 100 మీటర్ల రన్నింగ్, క్యారంబోర్డు, చెస్, షటిల్, వాలీబాల్ క్రీడల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. అసిస్టెంట్ కమాండెంట్లు సాంబశివరావు, రాందాసు, ఉదయభాస్కర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రమీల, ఆర్‌ఐలు నారాయణ, బి.శ్రీధర్, బి.శ్రీనివాస్, పి.శ్రీనివాస్, సీహెచ్ నేమాజీ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలి



చిన్న బోనాలలో నిరసన తెలుపుతున్న స్థానికులు

సిరిసిల్ల అర్బన్: విలీన గ్రామాలైన చిన్న బోనాల, పెద్ద బోనాల, రగుడు, పెద్దూర్, సర్దాపూర్, చంద్రంపేట, జగ్గారావుపల్లిని తిరిగి గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని చిన్న బోనాల కౌన్సిలర్ నాగరాజు అన్నారు. చిన్న బోనాలలో స్థానికులతో గురువారం నిరసన చేపట్టారు. 2018లో ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా సిరిసిల్ల మున్సిపల్‌లో కలిపారని, అప్పటినుంచి అభివృద్ధి కుంటుపడిందన్నారు. రెండేళ్లుగా తమ సమస్యను పట్టించుకోవడం లేదని, ఎన్నికల ముందు కేకే మహేందర్ రెడ్డి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ విలీన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిరన్నారు. ఇచ్చిన మాటను నిలుపుకోవాలన్నారు.

వెంకట్రావుపల్లి రోడ్డులో రేడియం స్టిక్కర్లు



బోయినపల్లి: కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో మండలంలోని వెంకట్రావుపల్లి బస్టాండ్ ఏరియా వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా రోడ్డు మధ్యలో గురువారం డివైడర్ ఏర్పాటు చేసి రేడియం స్టిక్కర్లు అమర్చినట్లు ఎస్సై దూలం పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని ఎస్పీ అఖిల్ మహజన్ ఆదేశాలతో ప్రమాద నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిత్తూ చిత్తూల బొమ్మ



వేములవాడ : రాజన్న ఆలయ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సిరిసిల్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కోనరావుపేట: ధర్మారంలో ..



ముస్తాబాద్‌లో ..

సిరిసిల్లటౌన్: సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో రెండోరోజు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. రెండో రోజున మహిళలు, చిన్నారులు, యువతులు బతుకమ్మ ఆటలతో అలరించారు. వాడవాడల్లో ఉయ్యాల పాటలతో మహిళలు బతుకమ్మ ఆడారు. మానేరు నదితో పాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పాయింట్లలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. జిల్లా కేంద్రంలోని వికాస్ డిగ్రీ, పీజీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఎంసీ చైర్మన్ వెల్మల స్వరూపరెడ్డి, ప్రిన్సిపాల్ జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడలో బతుకమ్మ వేడుకలు గురువారం రెండోరోజు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ కూడళ్ల వద్ద, మూలవాగు, రాజన్న ఆలయ ఆవరణలో బతుకమ్మ ఉంచి చిత్తూ.. చిత్తూల బొమ్మ .. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ ఆడిపాడారు. అనంతరం మూలవాగు, రాజన్న ధర్మగుండంలో నిమజ్జనం చేశారు.

ముస్తాబాద్: మండలకేంద్రంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఊరూరా తీరొక్క పూలతో మహిళలు బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు.

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు.

పనిచేయని వేబ్రిడ్జి



వేములవాడ వ్యవసాయ మార్కెట్‌లో పనిచేయని వేబ్రిడ్జి

వేములవాడరూరల్: వేములవాడ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేబ్రిడ్జి గత కొన్ని నెలలుగా పనిచేయడం లేదు. ఇక్కడినుంచి వెళ్లే వాహనదారులు వేబ్రిడ్జి పని చేయకపోవడంతో ప్రైవేట్ వేబ్రిడ్జిల వద్ద తూకం వేసుకుంటున్నారు. మార్కెట్ తరఫున నిర్మించిన ఈ వేబ్రిడ్జిని అధికారులు పట్టించుకోకపోవడంతో మార్కెట్ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతోంది. రోజూ వాహనాలు మార్కెట్‌కు వచ్చి తూకం వేసుకుంటే ఆదాయం వచ్చేది. ప్రస్తుతం వాహనాలు రాకపోవడంతో ఆదాయం తగ్గిపోయింది. ఇక వేములవాడ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు వ్యాపారులు వేబ్రిడ్జి నిర్వహించి తూకం పేరుతో నిలువున దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో ఓ రైతు వ్యాన్‌లో పత్తిని తీసుకువచ్చి తూకం వేయగా ఇంటి వద్ద వేసిన తూకం, వేబ్రిడ్జిలో వేసిన తూకానికి తేడాలు రావడంతో అనుమానం వచ్చిన రైతు సదరు వేబ్రిడ్జి నిర్వాహకుడిని నిలదీయగా అసలు మోసం బయటపడింది. ఇలా ప్రైవేట్ వే బ్రిడ్జి నిర్వాహకులు తూకంలో మోసాలు చేస్తూ రైతులను దగా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి,. తనిఖీ చేయాల్సిన సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా మార్కెట్ కార్యాలయంలో ఉన్న వేబ్రిడ్జిని మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

● పేకాటరాయుళ్ల అరెస్టు

ముస్తాబాద్: మండలంలోని లింగంకుంట శివారులో ముగ్గురు పేకాటరాయుళ్లను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. వారినుంచి రూ.7,800 నగదు, సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.